క్లుప్తంగా

నేడు కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపల్ 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ కే మధుమోహన్ అధ్యక్షతన నిర్వహించ నున్నట్లు కమిషనర్ బి.వెంకట్రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి


గాయత్రినగర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మీర్‌పేట: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట గాయత్రినగర్‌లో వీటీ రాయల్ చిట్‌ఫండ్ చైర్మన్ కే వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 సంవత్సరాలుగా వీటీ చిట్ ఫండ్ వారు ఈ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు పీ నర్సింహ్మా, కార్పొరేటర్ ఎం సబిత, చిట్‌ఫండ్ శాఖ మేనేజర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

ఎంపీపీ సుకన్య

యాచారం: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఎంతో కీలకమని పుస్తకాలే నేస్తాలుగా భావించి కష్టపడి చదువుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. యాచారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం అమెజాన్ వెబ్ సిరీస్ వారు పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సమీకృత ఆరోగ్యం మరియు సామాజిక అభివృద్ధి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని ఎంపీపీ తెలిపారు. ప్రభుత్వం నుంచే కాక దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయాల స్థాపనకు కృషి చేస్తే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గీత, హెచ్‌ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని ఆదిత్యానగర్ కాలనీలో పోచమ్మగుడి నిర్మాణ పనులకు గురువారం స్థానిక కౌన్సిలర్ పుల్లగుర్రం కీర్తన విజయానందరెడ్డి, కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేనా రెడ్డి, మాజీ అధ్యక్షుడు సతీష్, సభ్యులు యాదగిరి, జంగయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

తైబజారు వేలం మరోసారి వాయిదా

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ తైబజారు వేలం మరోసారి వాయిదా పడింది. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో గురువారం 2023–24 సంవత్సరానికి మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 9 మంది డీడీలు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. అయితే కేవలం రూ.12 లక్షలకు వేలంపాట పాడటంతో అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. గత ఏడాది తైబజారు వేలం రూ.19 లక్షలు పలికింది. ఈ ఏడాది రెండవసారి కూడా తక్కువగా రావడంతో తైబజారు వేలాన్ని వాయిదా వేశారు. తిరిగి తైబజారు వేలం నిర్వహిస్తామని తేదీని త్వరలో ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన గుంత శ్రీను గత సంవత్సర కాలంగా అనారోగ్యబారిన పడి జీవనం సాగిస్తున్నాడు. ఇతను గతంలో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. శ్రీను కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న సాటి డ్రైవర్లు అతడికి ఆర్థిక సహాయం చేయాలని అనుకున్నారు. డ్రైవర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రూ.10,000 విరాళాలు సేకరించారు. సంబంధిత డబ్బును గురువారం శ్రీనుకు అందజేశారు.

చిరుధాన్యాలపై అవగాహన

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పోషణ పక్వాడ–పోషణ అభియాన్‌లో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జయమ్మ మాట్లాడుతూ.. రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఎదిగే పిల్లలకు చిరుధాన్యాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిరుమల, ఏఎన్‌ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్ అన్నమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సర్వరోగ నివారిణి యోగా

చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆసక్తి


యోగా చేస్తున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: మారిన జీవనశైలి... ఆహారపు అలవాట్లకు తోడు.. ఉరుకుల పరుగుల జీవితం... టార్గెట్ల పూర్తి కోసం నిత్యం పని ఒత్తిడి.. వెరసి చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా తీవ్రమైన మానసిక, శారీరక ఒత్తిళ్లకు గురవుతున్నారు. చిన్న తనంలోనే మధుమేహం, హైపర్‌టెన్షన్, అధిక బరువు, గుండెపోటు వంటి పెద్ద జబ్బుల బారిన పడుతున్నారు. ఆరోగ్య పరంగానే కాదు ఆర్థికంగానూ తీవ్రంగా నష్టపోతున్నారు. తీవ్రమైన ఒత్తిళ్లు, జబ్బుల బారి నుంచి చిన్నపాటి యోగా చిట్కాల ద్వారా ఉపశమనం పొందొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యంతో పాటు ఒత్తిళ్లను జయించి, శరీర ఆకృతిని మెరుగు పర్చుకోవచ్చని ప్రకటిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షకాలం.. ఏకాగ్రత చాలా అవసరం.

మానసికోల్లాసం..

మానసికంగా పరిపక్వత చెందడానికి ప్రాణాయామం ఎంతగానో తోడ్పడుతాయి. శ్వాస నియంత్రణకు అనులోమ, విలోమ ప్రాణాయామ, పసిరిక ప్రాణాయామ, కఫాలబాది, సుఖప్రాణాయామా, శ్వాసను బంధించే కుంబక ప్రాణాయామాలు మానసిక పరిపక్వతకు, ఏకాగ్రతకు ప్రశాంతతకు ఎంతో తోడ్పడుతాయి. శారీరక పటుత్వానికి, అనారోగ్య సమస్యలను దూరం చేసేందుకు వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు, దేహంలోని గ్రంథులను ఉత్తేజం చేసే హార్మోన్లను నియంత్రించి, ఆరోగ్య రక్షణకు వ్యాధి నిరోధక శక్తికి ఎంతో తోడ్పడుతాయి. ప్రాణాయామాలు, వ్యాయామాలు ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని వృద్ధి చేస్తాయి. సూర్య నమస్కారాలు, ఆసనాలు యువతకు శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయి. సరళ వ్యాయామాలు, తేలికపాటి ప్రాణాయామాలు, ధ్యాన గ్రంథుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. ఆధ్యాత్మిక అభివృద్ధికి, సాధనకు, ప్రకృతి ద్వారా పొందే పంచభూత తత్వాలను శరీరం గ్రహించడానికి క్రియా యోగా సాధన ముందుకు తీసుకెళ్తుండటంతో ప్రజల సాంప్రదాయ ఈ యోగాసనాల వైపు దృష్టి సారిస్తున్నారు. వీటిలో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతుండడంతో యోగా శిక్షణ కేంద్రాలకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఏర్పడింది. యోగా గురువులకు ఇది మంచి ఉపాధి అవకాశంగా మారింది.

20 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా



మాది నల్లగొండ జిల్లా నేరేడుచర్ల గ్రామం. మొదట్లో నేను చాలా వీక్‌గా ఉండేవాడిని. ఆటల్లోనే కాదు చదువుల్లోనూ వెనుకబడి పోయేవాడిని. శారీరక, మానసిక వృద్ధికి యోగాసనాలు ఉపయోగపడుతాయని కొంతమంది చెప్పడంతో వాటిని నేర్చుకున్నా. 2002 నుంచి మఠపల్లిలోని భిక్షమయ్య గురూజీ వద్ద శిక్షణ పొందాను. నల్లగొండ, విజయవాడ, శ్రీకాకుళం, హైదరాబాద్ సహా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ 300 పైగా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఇప్పటివరకు 60 మంది నా వద్దే శిక్షణ పొందారు. యోగాసనాలనే ఉపాధి అవకాశంగా మార్చుకున్నా. అనారోగ్యం అనేది ఏనా డూ దరిచేరలేదు. యోగాలో నేను అందించిన సేవ లకు గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి స్వధర్మయోగి, గాంధీ గ్లోబల్ ట్రస్ట్ నుంచి సేవా రత్న, ఆంధ్ర సారస్వతి పరిషత్ నుంచి యోగా రత్న అవార్డు కూడా వరించింది.

– ఇస్మాయిల్, యోగా గురూజీ

చోరీల నియంత్రణకు ప్రచారం

ఆటోకు బ్యానర్ కట్టి, మైక్ ద్వారా అవగాహన

కందుకూరు: దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు కందుకూరు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆటోకి బ్యానర్ కట్టి మైక్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు వాట్సాప్, సోషల్ మీడియాలో జాగ్రత్తలు తెలుపుతూ ప్రచారం చేసేవారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేలా వినూత్న ప్రచారం చేపట్టారు. ఆటో చుట్టూ జాగ్రత్తలు తెలిపేలా బ్యానర్లు కట్టి మైక్ ద్వారా గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.

పోలీసుల సూచనలు

- మహిళలు ఒంటరిగా వెళ్లే సమయంలో బంగారు ఆభరణాలు కనిపించకుండా కొంగుతో కప్పుకోవాలి.
- కిరాణా షాపుల్లో, పొలాల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలు అపరిచిత వ్యక్తులు వచ్చినప్పుడు అప్రమత్తతో ఉండాలి.
- గ్రామ శివారులో అనుమానిత వ్యక్తులను గుర్తించి నప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఊరికి వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదు.
- పొలాల్లో బోర్లు వినియోగించనప్పుడు కేబుల్‌ను భద్రపరుచుకోవాలి.
- మేకలు, గొర్రెలు, పశువుల దొడ్ల వద్ద రాత్రి వేళ కాపలా ఉండాలి.
- పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండా బోల్టులు బిగించడం, వెల్డింగ్ చేయించాలి.
- పంట దిగుబడిని పొలాల్లో కాకుండా ఇంట్లో భద్రపరచుకోవాలి.
- సీసీ టీవీ కెమెరాలు ఇంటికి నాలుగు వైపులా కనిపించేలా అమర్చుకోవాలి.


కందుకూరు చౌరస్తాలో ఆటో ద్వారా ప్రచారం చేయిస్తున్న పోలీసులు

రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి

బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శివకుమార్


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

తుక్కుగూడ: రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శివకుమార్ సూచించారు. గురువారం రావిర్యాల నుంచి ఆర్‌సీఐ గేటు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన కౌన్సిలర్ బీ యాదగిరిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు కాంట్రాక్టర్ గతంలో ఉన్న బీటీ రోడ్డును తవ్వకం, చదును చేయకుండా కొత్త రోడ్డు కోసం మట్టి పోయడం జరుగుతోందన్నారు. ఉన్న బీటీని పూర్తిగా తీసివేసి తదనంతరం మట్టి పోసి రోడ్డు వేయాలన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

తండాల్లో వసతుల కల్పనే లక్ష్యం

- వైస్ ఎంపీపీ సునిత
- కేసీ తండాలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

మహేశ్వరం: తండాల్లో మౌలిక వసతుల కల్పించి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని వైస్ ఎంపీపీ ఆర్ సునిత పేర్కొన్నారు. గురువారం మండలంలోని కేసీ తండాలో ఎంపీటీసీ నిధులు రూ. 3.70 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి తండాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి వసతి, ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామ పంచాయతీల్లో వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనం, చెత్త డంపింగ్ యార్డు, ట్రాక్టర్, ట్యాంకర్, నర్సరీలను ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. మంత్రి సబిత, జెడ్పీ చైర్‌పర్సన్ టీ అనితారెడ్డి, ఎంపీపీ రఘుమారెడ్డి సహకారంతో మండలానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కేసీ తండా సర్పంచ్ జీ మోతీలాల్ నాయక్, ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యులు సూర్య నాయక్, లాలా నాయక్, రవీందర్ నాయక్, కంలీ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రెడ్యా నాయక్, సుధాకర్, మున్యా, నరేష్, రాజు, నాయక్ పాల్గొన్నారు.


కేసీ తండాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ సునిత

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం


మీర్‌పేట: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరవింద్ తదితరులు


పహాడీషరీఫ్: భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు అరవింద్

మీర్‌పేట: దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు ఉరి కొయ్యను ముద్దాడి ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయులని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి అరవింద్ అన్నారు. సుఖ్‌దేవ్, రాజ్‌గురు, భగత్‌సింగ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా గురువారం మీర్‌పేట కూడలిలో వారికి నివాళులర్పించారు. అనంతరం అరవింద్ మాట్లాడుతూ.. స్వేచ్ఛాయుత భారతం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిరుప్రాయంలోనే ప్రాణాలను త్యాగం చేసిన మహనీయున్నారు. నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దాసరి బాబు, సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ పెంటయ్య, నాయకులు టీ సాయినాథ్‌రెడ్డి, నర్సింహ్మా, ఉపేందర్, శంకర్, బాలయ్య పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

పహాడీషరీఫ్: దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ అని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్ కొనియాడారు. బీజేవైఎం జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు పి.నాగార్జున్ ఆధ్వర్యంలో శ్రీరాములు కాలనీలో భగత్‌సింగ్ విగ్రహానికి శ్రీరాములు యాదవ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ ప్రశాంతి శ్రీధర్ గౌడ్, నాయకులు దిలీప్ గౌడ్, బోడ హరికృష్ణ, గౌర మురళి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులకు భయపడేది లేదు

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: అరెస్టులకు భయపడేది లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాతరెడ్డి అన్నారు. గురువారం సిట్ విచారణకు రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వీ ప్రభాకర్‌రెడ్డి, ఏ మహేశ్వరి, బీ మనోహర్, బాలునాయక్, పీ సుదర్శన్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, బీ బాబు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి బీ రాఘవేందర్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి ఎస్ మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బీ గోవర్ధన్‌రెడ్డి, ఆర్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీ శ్రీధర్‌రెడ్డి, భాను, అనిల్, ధనుష్ హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రశ్నపత్రం లీకేజీతో సంబంధం ఉన్న బీఆర్‌ఎస్ నాయకులను గాలికి వదిలేసి కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ తప్పిదాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలు ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని అన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్‌ఎస్ అవినీతిని ఎండగడుతూనే ఉంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.


యూత్ కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తలకొండపల్లికి చేరిన పాదయాత్ర

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ పోతుగంటి కృష్ణ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఏప్రెల్ 4న హైదరాబాద్ దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ సన్నాహక పాదయాత్ర గురువారం తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్, గట్టుప్పలపల్లి, వెంకట్రావ్‌పేట్ గ్రామాల్లో పర్యటించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోతుగంటి కృష్ణ మాట్లాడారు. ఈ వర్గీకరణతో ఎస్సీల్లోని 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ,బీ,సీ,డీ వర్గీకరణతో అన్ని ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, జగన్, ధనంజయ్, శ్రీశైలం, నవీన్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రంగానికి నిధులు కేటాయించాలి

ఏఐసీటీయూరాష్ట్ర నాయకుడు పురుషోత్తం

బడంగ్‌పేట్: కేంద్ర బడ్జెట్‌లో కార్మిక రంగానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాలని ఏఐసీటీయూ రాష్ట్ర నాయకుడు బీ పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పురుషోత్తం మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో కార్మిక రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలన్నారు. కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు కార్మిక చట్టాలను వర్తింపజేయడం తోపాటు పని చేసే చోట రక్షణ కల్పించాలన్నారు. సంఘటిత కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలన్నారు. కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సుజాత, బాలాపూర్ మండల అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.


లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పురుషోత్తం, సుజాత

వడగండ్ల బాధితులను ఆదుకోవాలి

అదనపు కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి

ఇబ్రహీంపట్నం: వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని అదనపు జిల్లా కలెక్టర్ తిరుపతయ్యకు ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పటికీ ఇప్పటికీ ప్రభుత్వ ఒక అంచనాకు రాకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం పసల్ బీమా యోజన పథకాన్ని ష్ట్ర ప్రభుత్వం అమలు పరచకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. దెబ్బతిన్న పంటలకు, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నేత ఆచారి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పాపయ్యగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింహారెడ్డి, సుదర్శన్‌యాదవ్, నాయకులు.. నర్సింగ్ రాజ్, రాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పల్లె కృష్ణగౌడ్, నర్సింహారెడ్డి, దేశ్యానాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

మాజీ ఎమ్మెల్యే రాములు

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించనున్నట్లు సీపీఐ నేతలు అన్నారు. ఇబ్రహీంపట్నం డాగ్‌బంగ్లాలో గురువారం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, సీపీఐ రాష్ట్ర కమిటీ సమితి నాయకులు కావలి నర్సింహ, ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలపై ఏప్రిల్ 14 నుంచి పాదయాత్రలు, జీపు జాతలు, బైక్ ర్యాలీలను నిర్వహించి ప్రజలను చైతన్య పరచనున్నట్లు చెప్పారు. ఫార్మాసిటీ భూబాధితులకు అండగా పోరాటం చేస్తామన్నారు. దేశంలో మతోన్మాద బీజేపీ అరాచకాలు పెరిగిపోయాయన్నారు. నిత్యావసరాల ధరలు కూడా పెరిగిపోయాయన్నారు. బీజేపీని గద్దె దించేతేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. శనివారం సీపీఐ విస్తృత స్థాయి సమావేశాన్ని భారత్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు అలీ మొద్దీన్, మండల కార్యదర్శి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

జైళ్ల శాఖ ఐజీ రాజేశ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ ఐజీ రాజేశ్

హస్తినాపురం: చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే ఎవరికైనా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని జైళ్ల శాఖ ఐజీ వై.రాజేశ్ అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం ప్రతినిధి భరత్ సంగం ఆధ్వర్యంలో సందేశాత్మకమైన సూక్తులతో కూడిన పోస్టర్‌ను గురువారం ఐజీ రాజేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజీ రాజేశ్ మాట్లాడుతూ... మార్చి 23న లాహోర్ జైలులో భరతమాత ముద్దుబిడ్డలు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు లాంటి మహోన్నతమైన వ్యక్తులను బ్రిటిష్ సర్కార్ ఉరి తీసిన రోజని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేసిందల్లా భరత మాత ముద్దుబిడ్డలు బాగుపడాలని ప్రజలను చైతన్య పరచడమేనని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం.. భావి భారత పౌరుల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి చెడు వ్యసనాలకు దాసోహమైన వారి జీవితం అంధకారంగా మారుతుందని యువతకు సూచించారు. నేరాలు చేయొద్దు గ్రామాలు వీడొద్దు అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు శ్రీమాన్ రెడ్డి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జలమే జీవనాధారం



ఇంకుడు గుంతలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రవికుమార్, తదితరులు

గాయత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు రవికుమార్

మీర్‌పేట: జలమే జీవనాధారమని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని గాయత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు బీ రవికుమార్ సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లెలగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జలమండలి సహకారంతో గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. నీరు ఎంతో విలువైందని, నల్లాల ద్వారా నీరు వృథాగా పోకుండా చూడాలన్నారు. ఇంకుడు గుంతల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు కాలనీలు, పాఠశాలల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్వాతి, హర్షవర్ధన్, పాఠశాల ఎస్‌ఎం కమిటీ చైర్మన్ టీ నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.